క్లుప్తంగా

సివిల్ సప్లై డీఎంను కలిసిన పీఏసీఎస్ మాజీ చైర్మన్



మోహన్‌కృష్ణను సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ: సివిల్ సప్లై డీఎం మోహన్‌కృష్ణను పీఏసీఎస్ మాజీ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో శాలువాకప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

తాండూరు రోడ్లపై భారీ కంటైనర్

ఆసక్తిగా తిలకించిన జనం



లారీలో వెళ్తున్న భారీ కంటైనర్

తాండూరు టౌన్: ఓ భారీ కంటైనర్‌తో కూడిన లారీ తాండూరు రోడ్లపై పరుగులు తీసింది. పరిశ్రమల్లో వాడే పెద్ద ట్రాన్స్ ఫార్మర్‌ను భారీ కంటైనర్‌లో శుక్రవారం మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి తాండూరు మీదుగా వెళ్తుండగా జనాలు ఆసక్తిగా చూశారు. ఏకంగా 64 టైర్లు గల లారీలో కంటైనర్‌ను తరలించారు. ఎత్తుగా ఉండడంతో విద్యుత్ తీగలు తగలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

రాజ్యాంగ విలువలు పరిరక్షించాలి

మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: భారత రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేసారంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి ఎంతో కీర్తి ఉందన్నారు. ప్రతి ఒక్క పౌరుడు రాజ్యాంగ విలువలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. భావి తరాలకు దిక్సూచి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, చంద్రయ్య, ఆనందం, నందు, సుభాస్, మహంత్‌స్వామి, సిరాజోద్దీన్, లాయక్‌అలీ పాల్గొన్నారు.

శ్రీరామానుజ జయంతి



విశేష అలంకరణలో శ్రీరామానుజ స్వామివారు

కొడంగల్: పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం ఆలయ పురోహితులు, ధర్మకర్తలు శ్రీరామానుజ జయంతి నిర్వహించారు. శ్రీరామానుజ జీయర్ స్వామివారి మూలమూర్తికి ఆలయ అర్చకులు పట్టువస్త్రాలను సమర్పించారు. రామానుజ స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కులగణనతో అందరికీ మేలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వేను ఓర్వలేక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు అర్థం లేకుండా మాట్లాడడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కామారెడ్డిలో నిర్వహించిన జోడో యాత్రలో కులగణన నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో కుల సర్వే సక్రమంగా లేదని ఆరోపించడం మానుకోవాలని చెప్పారు.

‘చింత’ తీరేనా?

15 ఏళ్లుగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం

- బీఆర్ఎస్ పాలనలో ఊసేలేదు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయాలని వేడుకోలు



అసంపూర్తిగా వంతెన



ఏర్పాటు చేసిన శిలాఫలకం

ధారూరు: మండల పరిధిలోని చింతకుంట–ధారూరు గ్రామాల మధ్యన కాగ్నా ఉపనదిపై వంతెన నిర్మాణానికి రూ. కోటి కేటాయించారు. అప్పటి గనులు, భూగర్భ జలవనరుల శాఖ మంత్రి పి సబితారెడ్డి 2009, ఫిబ్రవరి 2న శంకుస్థాపన చేశారు. అప్పట్లో మంత్రి మాట్లాడుతూ 2010లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధారూరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చింతకుంట గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కానీ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరగాల్సి ఉంటుందని చింతకుంట, మైలారం, కొత్తతండా ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. 3 కిలో మీటర్ల దూరానికి, చింతకుంట నుంచి హరిదాస్‌పల్లి మీదుగా ధారూరు 6 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని చింతకుట గ్రామస్తులు, తండా నుంచి ధారూరుకు రావడానికి 10 కిలోమీటర్లు పడుతుందని కొత్తతండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన పూర్తయితే కేవలం 3 కిలో మీటర్ల ప్రయాణంతో మండల కేంద్రానికి చేరుకోవచ్చని ప్రజలు, గిరిజనులు చెబుతున్నారు. ఈ విషయం గురించి మంత్రి, ఎమ్మెల్యే, అధికారులకు, నాయకులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని చింతకుంట గ్రామస్తులు వాపోయారు. ప్రస్తుత శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తగిన చొరవ తీసుకుంటే వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు వెచ్చించి..

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే వంతెన నిర్మాణం పూర్తవుతుందని స్థానికులు చెబుతున్నారు. దీనికోసం ఎన్ని నిధులు అవసరమౌతాయోనని ఎస్టిమేట్ చేయించి నిధులు మంజూరు చేయించాలని పలువురు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేశారని, పూర్తి చేయించే బాధ్యత కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకోవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ సంవత్సరం ప్రమాదాలే

ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే కాగ్నా ఉపనదికి ఇరువైపుల పొలాలున్నా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనుల్లో భాగంగా నదిని దాటాలంటే భయాందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. పశువులు, మేకలు ప్రవాహ నీటిలో కొట్టుకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు. వాగు నీటి ప్రవాహానికి సైతం మనుషులు కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా వంతెన పనులకు నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంకర్ల సహకారం తప్పనిసరి

- ఎంపీడీఓ విశ్వప్రసాద్
- రాజీవ్ యువ వికాసంపై సమన్వయ సమావేశం

తాండూరు రూరల్: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక కోసం బ్యాంకర్ల సహకరాం అవసరమని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ బ్యాంక్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..రాజీవ్ యువ వికాసానికి మండలంలోని 33 గ్రామాల నుంచి 2,210 దరఖాస్తులు వచ్చాయన్నారు. బీసీ–1,251, ఎస్సీ–548, ఎస్టీ–112, మైనార్టీ–240, ఎంబీసీ–21, ఈబీసీ–37, క్రిస్టియన్ మైనార్టీ–01తో పాటు ఇతర దరఖాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు సంబంధించి సెల్‌ఫోన్ నంబర్, ఆధార్‌కార్డుల వివరాలు బ్యాంక్ అధికారులకు అందజేశామన్నారు. బ్యాంక్ అధికారులు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల బ్యాంక్ సిబిల్ స్కోర్ వివరాలను శనివారంలోపు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించామన్నారు. సిబిల్ స్కోర్ అందజేసిన తర్వాత నిరుద్యోగులను పిలిచి ఇంటార్వ్యూలు చేస్తామని చెప్పారు.

మండలానికి 292 యూనిట్లు మంజూరు..

ప్రస్తుతం రాజీవ్ యువ వికాసానికి సంబంధించి తాండూరు మండలానికి కేవలం బీసీ కార్పొరేషన్ నుంచి 292 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. ఇందులో రూ.50వేల రుణానికి–122 యూనిట్లు, రూ.లక్షకు–64 యూనిట్లు, రూ.2లక్షలకు–64 యూనిట్లు, రూ.4 లక్షల రుణానికి –43 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయని చెప్పారు. మిగత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల యూనిట్లు తర్వాత మంజూరవుతాయన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు పరిశీలించేందుకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుశీల్ కుమార్, బ్యాంక్ ప్రతినిధులు శ్రావణి, రాజేష్, పురుషోత్తం, కేతన్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, బ్యాంకర్లు

ఏఈఓలకు కొత్త సెల్ నంబర్లు

తాండూరు రూరల్: జిల్లాలో వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. ఇందులో భాగంగా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారు(ఏఈఓ)లకు కొత్త ఫోన్ నంబర్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం గ్రామాల్లో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో రైతులకు మరింత అందుబాటులో ఉండే విధంగా అధికారులు కొత్త నంబర్లు కేటాయించారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాండూరు మండలంలో..

అంతారం	శివకుమార్	8977769041
బెల్కటూర్	శ్రీనివాస్	8977769043
చెంగోల్	శ్రీకాంత్	8977769044
కరన్‌కోట్	లక్ష్మణ్	8977769045
కోటబాసుపల్లి	శ్రవణ్‌కుమార్	8977769046
సిరిగిరిపేట్	శ్రీకాంత్	8977769047
పాతతాండూరు	శ్రవణ్‌కుమార్	8977769048

అసంపూర్తిగా పశువైద్యశాల భవనం

- బిల్లులు రాక నిలిపివేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



పూర్తికాని పశువైద్యశాల భవనం

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో నిర్మిస్తున్న పశువైద్యశాల భవనం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయంలో రూ.10లక్షలతో భవనాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. స్లాబ్, గోడల వరకు పనులు పూర్తి చేశారు. ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ చేయలేదు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో ఏడాదిన్నరగా వృథాగా ఉంది. ప్రస్తుతం పశువైద్యశాల అకడే ఓ శిథిల భవనంలో కొనసాగుతుంది. వర్షాకాలం వస్తే ఆ భవనం కురుస్తుంది. కనీసం మందులు పెట్టుకోవడానికి కూడా స్థలంలేదు. చుట్టు పక్కల తండాలు ఎక్కువగా ఉండడంతో రైతులు పశువులను వివిధ రకాల చికిత్స నిమిత్తం ఇక్కడికి తీసుకొస్తుంటారు. పవువైద్యశాలకు భవనం, స్థలం లేకపోవడంతో సిబ్బందితో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబధిత అధికారులు స్పందించి పశువైద్యశాల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరుతున్నారు.

ఘనంగా మేడే

దౌల్తాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సచంద్రయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ చట్టాలను కేంద్రం తూట్లు పొడుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిలు, రాములు, సాయిదాస్, అంగన్‌వాడీ టీచర్లు నర్సింగమ్మ, అన్నపూర్ణ, ఆటోయూనియన్ నాయకులు వెంకటయ్య, రాములు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని ధర్మానాయక్ తండాలో రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో రహదారులను నిర్మించడంతో మౌలిక సదుపాయల కల్పన సులభతరం అవుతుందన్నారు. తండాల్లో కూడా నాణ్యమైన రోడ్డు సౌకర్యం కల్పిస్తే అభివృద్ధిపథంలో ముందుకుసాగుతాయని పేర్కొన్నారు. లింగ్యానాయక్, పుణ్యానాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



తాండూరు టౌన్‌: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ



కొడంగల్ రూరల్: తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నాయకులు

తాండూరు టౌన్: ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాండూరు పట్టణంలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక ఖాన్ కాలనీ నుంచి శాంత్ మహల్ చౌక్, వినాయక్ చౌక్, ఇందిరా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నల్ల జెండాలను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాయాలని చూస్తోందన్నారు. వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేని ఎడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. జామ మసీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, మైనారిటీ నాయకులు ఎస్‌బి గుల్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఒక్కో బిల్లును ప్రవేశ పెడుతోందని విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ బి.విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హాఫిజ్ అబ్దుల్‌కరీం, అఫ్రోజ్‌ఖాన్, హాఫిజ్ బాసిత్, షేక్ రోమన్, ఎండి సర్తజ్ హుస్సేన్, ఎండి షాకీర్, ఏకె యూసుఫ్, అజ్మీర్‌ఖాన్, హాఫిజ్ యూసుఫ్, హాఫిజ్ నసీర్, ఆపిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్లకు పీఆర్టీయూ సన్మానం



పూడూరు: సన్మానిస్తున్న రహీస్‌హమ్మద్‌ఖాన్



యాలాల: సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

యాలాల: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను మండల పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అగ్గనూరు ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్య, పూజ, మానుష టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా వారికి పారితోషికాన్ని సంఘం అధ్యక్షుడు క్రిష్టారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి రాములు, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు విజయ్‌కుమార్, రాంచందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

పూడూరు: పది ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌హమ్మద్‌ఖాన్ ఉపాధ్యాయులను, విద్యార్థులు అక్షర, సారాబేగం తల్లిదండ్రులను సన్మానించారు. శుక్రవారం మండల పరిధిలోని చన్గోముల్ జెడ్పీఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేపడుతున్నారన్నారు. ఉపాధ్యాయులు క్రిష్టయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

జగద్గురువు ఆది శంకరాచార్య జయంతి



యజ్ఞంలో పూర్ణాహుతి

కొడంగల్ రూరల్: పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో సంపూర్ణ ఆయుర్వేద ఆస్పత్రిలో శుక్రవారం డాక్టర్ హీరాలాల్ నేతృత్వంలో డాక్టర్ మహేందర్ దంపతులు భక్తిశ్రద్ధలతో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యజ్ఞం, విష్ణు సహస్త్ర నామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. అనంతరం ఆధ్యాత్మిక . దార్మిక సేవా సమితి సభ్యులు ప్రవచనాలు అందించారు. యజ్ఞం చేయడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వాతావరణం ప్రశాంతంగా తయారయ్యే అవకాశం ఉంటుందని, ధర్మం ఆచరించడం, అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సంబురాలు చేశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులసర్వే తప్పులు తడకగా ఉందన్నారు. ప్రధాని నాయకత్వంలో సామాజిక సమానత్వం వైపు దేశంలో అడుగులు పడుతున్నాయని తెలిపారు. అందుకు ముందు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు అశోక్, కుర్మయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



కుల్కచర్ల: వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు



మోమిన్‌పేట: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సన్నవడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చినమాట ప్రకారం సన్నరకం వడ్లకు మద్దతు ధర రూ.2,320లతో పాటు బోనస్ రూ.500లు ఇస్తారన్నారు. కావున రైతులు దళారులను నమ్మి ధాన్యాన్ని అమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు జోగు వెంకటయ్య, అంజిలయ్య గౌడ్, జలీల్, శివానందు, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఏస్ గోదాంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.3,371లు నిర్ణయించిందన్నారు. రైతులు బహిరంగ మార్కెట్‌కు వెళ్లకుండ ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని ఆయన సూచించారు. రైతులు జొన్న పంట సాగు చేసినట్లు ఏఇఓతో రాయించుకొని రావాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్సులను వెంట తీసుకరావాలని సూచించారు. తేమ శాతం తక్కువగా ఉండే విధంగా, దుమ్ము లేకుండ చూసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జితేందర్‌రెడ్డి, పాపిరెడ్డి, నాయకులు సుభాష్‌గౌడ్, సురేందర్, సిరాజోద్దీన్, మహంత్‌స్వామి, సీఈఓ శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.